

కోరుట్లరూరల్: వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కుప్ప నుంచి నీటిని తొలగిస్తున్న రైతులు



కథలాపూర్: ఊట్‌పల్లిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షపు నీరు

# అకాల వర్షం.. రైతులకు నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

కోరుట్ల రూరల్/కథలాపూర్, మే 7: కోరుట్ల, కథలాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం వేకువజామున అకాల వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కేంద్రాల్లో హమాలీల కొరతతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నది. కేంద్రాల్లో సరిపడా హమాలీలను ఏర్పాటు చేసి, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# కాంగ్రెస్‌లో రచ్చకెక్కిన వర్గపోరు

- కోరుట్ల నియోజకవర్గ నాయకుల మధ్య గొడవ
- ఏఐసీసీ పరిశీలకుడి ఎదుటే సభలో గందరగోళం



ఏఐసీసీ పరిశీలకుడితో వాగ్వాదానికి దిగుతున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల, మే 7: జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో కోరుట్ల కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. సాక్షాత్తూ ఏఐసీసీ పరిశీలకుడి ఎదుటే పార్టీలో వర్గపోరు రచ్చకెక్కింది. ఈ సమావేశాన్ని డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించగా, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాల్, మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో పదవులు ఉన్న నాయకులను సభా వేదికపైకి పిలువగా, కోరుట్ల, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లను కూడా జిల్లా అధ్యక్షుడు ఆహ్వానించారు. దీంతో మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ గోవర్ధన్ సభా వేదిక వద్దకు రావడంతో జువ్వాడి నర్సింగరావు వర్గీయులు ఒక్కసారిగా లేచి గో బ్యాక్, గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో కాంగ్రెస్ నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు వర్గీయులు కూడా జువ్వాడి నర్సింగరావు వర్గంతో గొడవకు దిగారు. ఇరువర్గాలు ఒకరికొకరు తోసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుందని గమనించిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరువర్గాలను సముదాయించారు. అనంతరం జువ్వాడి, కల్వకుంట్ల వర్గీయులకు దండంపెట్టి మరీ గొడవ ఆపాలని అభ్యర్థించారు. దీంతో సమావేశాన్ని కొద్దిసేపు వాయిదా వేశారు. అనంతరం సుజిత్‌రావు వర్గీయులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం సమావేశం కొనసాగింది.



విచారణ జరుపుతున్న అధికారులు

## బూరుగుకుంట కట్ట ధ్వంసం

కొడిమ్యాల, మే 7: మండల కేంద్రంలోని బూరుగుకుంట కట్టను ఓ రైతు ధ్వంసం చేయగా అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఇరిగేషన్ డీఈ శ్యామిల్‌కుమార్, ఏఈ రాజేష్‌కన్నా తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బొల్లెన్‌చెరువు వెళ్లే దారిలో బూరుగుకుంట వద్ద ఇరిగేషన్ అధికారులు మంగళవారం చెరువు మత్తడి ప్రాంతాన్ని నీళ్లు బయటకు వెళ్లే విధంగా చదును చేయించారు. చెరువు పక్కనే భూమి ఉన్న రైతు బసనవేని అంజయ్య తన భార్య అనిత పేరు మీద ఈ ప్రాంతంలో భూమి ఉందని మంగళవారం రాత్రి ఎక్స్‌కవేటర్‌తో కుంట కట్టను సగం వరకు తొలగించాడు. ఇరిగేషన్ అధికారులతో పాటు ఎస్‌ఐ సందీప్, ఆర్‌ఐ కరుణాకర్, సర్వేయర్ వెళ్లి కట్ట ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఏఈ రాజేష్‌కన్నా ఫిర్యాదు మేరకు అంజయ్య, అనితపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

## చెక్కులు అందజేత

మేడిపల్లి, మే 7: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఇల్లెందుల శ్వేతకు రూ. 15 వేలు, కట్ట లింగన్నకు రూ. 60 వేలు, చిట్యాల ప్రశాంత్‌కు రూ. 20 వేలు, కానుగంటి రాజేందర్‌కు రూ. 23 వేలు, పులి లావణ్యకు రూ. 29 వేల చొప్పున సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, లబ్ధిదారులకు బుధవారం మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ కుమార్ చెక్కులు అందజేశారు.

## రోగులకు పండ్లు పంపిణీ

మెట్‌పల్లి, మే 7: పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి వాసవిమాత జయంతిని పురస్కరించుకొని రోగులకు పండ్లు, బ్రెడ్, వోఆర్‌ఎస్ ప్యాకెట్లను బుధవారం ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కొత్త నవీన్, ముక్క నరేశ్, జిల్లా నవీన్, చాడ సురేశ్, చిటికేశి రంజిత్, శివపాల్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత



కొనుగోలు కేంద్రంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

- ధాన్యం తూకంలో జాప్యం
- త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని అన్నదాతల వేడుకోలు

కొడిమ్యాల, మే 7: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరతతో తూకం వేయడంలో జాప్యం జరుగుతున్నట్లు రైతులు తెలిపారు. కేంద్రానికి 160 మంది రైతులు వడ్లు తీసుకురాగా, 38 మంది వడ్లు మాత్రమే తూకం వేశారు. 8 మంది హమాలీలు ఉండడంతో తూకం వేయడంలో జాప్యం జరుగుతున్నదని రైతులు వాపోతున్నారు. రెండు రోజులుగా పడుతున్న అకాల వర్షానికి వడ్లు తడిసి మొలకెత్తినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. హమాలీల కొరత ఉందని, అదనంగా ఏర్పాటు చేయాలని రైతులు విన్నవించారు. కాగా, మీరే సంచుల్లో వడ్లు నింపుకోవాలని అదనపు కలెక్టర్ సూచించినట్లు రైతులు తెలిపారు. తాము సంచుల్లో ధాన్యం నింపితే హమాలీలకు బస్తాకు రూ. 15కు బదులు రూ. 7.50 మాత్రమే చెల్లిస్తామని రైతులు తెలపడంతో అలా కుదరదని, మొత్తం డబ్బులు ఇవ్వాలని అదనపు కలెక్టర్ సూచించినట్లు చెప్పారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఏపీఎం పద్మను వివరణ కోరగా చిన్న చిన్న ధాన్యం కుప్పలు ఉన్న రైతులు సంచుల్లో నింపుకుంటే తూకం వేయడం త్వరగా పూర్తవుతుందని మేడం చెప్పిందని తెలిపారు.

### సగం డబ్బులు ఇస్తే ధాన్యం నింపుకొంటాం



అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రంలో హమాలీల సంఖ్య పెంచాలని అదనపు కలెక్టర్‌కు విన్నవించాం. మేడం చెప్పినట్లు తామే సంచుల్లో ధాన్యం నింపుకొంటాం. హమాలీలకు చెల్లించే కూలి డబ్బుల్లోంచి సగం మేమే తీసుకుంటాం. ఏదైతేనేం వడ్లు త్వరగా తూకం వేయాలి.

**-కొట్టాల ముత్యంరెడ్డి, రైతు, కొడిమ్యాల**

## భద్రత ప్రమాణాలు పాటించాలి





మాట్లాడుతున్న ఎస్‌ఈ సాలియా నాయక్

మెట్‌పల్లి రూరల్, మే 7: విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఉన్నతమైన భద్రత ప్రమాణాలు పాటించినప్పుడే విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ సాలియా నాయక్ పేర్కొన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు బాధ్యతతో హెల్మెట్, సేఫ్టీబెల్ట్ ధరించి, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ వేసుకొని పనికి ఉపక్రమించాలని తెలిపారు. పనిచేసే ఫీడర్‌పై సరైన లైన్ క్లియర్ తీసుకోవాలని, రెండు ఫీడర్ల క్రాసింగ్‌లు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.అనంతరం విద్యుత్ కార్మికుల శ్రేయస్సు కోసం రోజువారీ పనిలో ఉపయోగించే వివిధ విద్యుత్ పరికరాల ఆవిష్కర్త అల్లాడి ప్రభాకర్‌ను ఎస్‌ఈ అభినందించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఈ గంగారాం, ఏడీఈ మనోహర్, ఏఈలు అమరేందర్, రవి, అజయ్, వినీత్, సతీశ్, సంతోశ్, ప్రదీప్, శివకుమార్, సబ్ ఇంజినీర్లు, కార్మిక సంఘాల నాయకులు లక్ష్మణ్, రవి, సురేశ్, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మెట్‌పల్లి, మే 7: మెట్‌పల్లి పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలోని హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన నిందితుడిని మెట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు గమనించి అదుపులోకి తీసుకుని విచారించారు. అతను సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన చెప్యాల నరసింహగా గుర్తించారు. మూడు రోజుల క్రితం పలు చోరీల కేసుల్లో అరెస్ట్ అయి చెంచల్‌గూడ జైలు నుంచి విడుదలైనట్లు విచారణలో వెల్లడైంది. పట్టణంలోని పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడేందుకు ప్రణాళిక వేసుకున్న క్రమంలో స్థానిక పోలేరమ్మ ఆలయంలో హుండీ ధ్వంసం చేసి అందులో నుంచి రూ. 3500 నగదు ఎత్తుకెళ్లినట్లు నిందితుడు అంగీకరించాడు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు చెప్యాల నరసింహాను అరెస్ట్ చేసి, రూ. 3100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం జైలు నుంచి విడుదలై మళ్లీ దొంగతనాలకు పాల్పడేందుకు యత్నిస్తున్న కరుడు గట్టిన దొంగను చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్, బ్లూకోల్ట్ సిబ్బంది విజయ్, ప్రణయ్‌ను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్ అభినందించారు.

## పసుపు క్వింటాల్ @ రూ.13,151

మెట్‌పల్లి, మే 7: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 13,151 కనిష్ఠంగా రూ.9,899, గోళ (మండ) గరిష్ఠంగా రూ. 12,388, కనిష్ఠంగా 8,111, చూర గరిష్ఠంగా రూ.10,151, కనిష్ఠంగా 9,111 పలికింది. ఈ రోజు 91 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

ధర్మపురి, మే 7: ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై బుధవారం సీసీఎస్ పోలీసులు దాడి చేసి రూ.26,060 నగదు స్వాధీనం చేసుకొని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దొంతాపూర్ శివారులో పేకాడుతున్నారనే సమాచారంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.26,060 నగదు, 6 మొబైల్ ఫోన్లు సీజ్ చేసి ధర్మపురి పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ కానిస్టేబుళ్లు రమేశ్, అఫ్రోజ్, కమలాకర్, ఖాసీం పాల్గొన్నారు.

## గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల, మే 7: ప్రజలు గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సందీప్ సూచించారు. మండలంలోని చెప్యాల గ్రామంలో సామాజిక అంశాలపై బుధవారం జిల్లా పోలీస్ కళా బృందంతో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సందీప్ మాట్లాడుతూ, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, మూఢనమ్మకాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగుపై రైతులకు అవగాహన



మల్యాల: ముత్యంపేటలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

సారంగాపూర్/మల్యాల/కోరుట్ల రూరల్, మే 7: సారంగాపూర్ మండలం మ్యాడారం తండా, మల్యాల మండలం ముత్యంపేట, కోరుట్ల మండలం నాగులపేట గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులు, పంట నష్ట పరిహారం, ఎరువుల వినియోగం, పంట మార్పిడి, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొలాస వ్యవసాయ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ అరుణ్‌కుమార్, ప్రజ్ఞ, రజనీకాంత్, శాస్త్రవేత్తలు సాయినాథ్, గోండ్యా నాయక్, స్వాతి, ఏడీఏ రమేశ్, ఏవోలు చంద్రదీపక్, లావణ్య, ఏఈవోలు వెంకటేశ్, మంజుల, నరేశ్, కారుణ్యకుమార్, హార్టికల్చర్ అధికారి రజిత, సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జగిత్యాల, మే 7: జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవోకు భారత్ సురక్ష సమితి నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో సుమారు 1040 ఎకరాల్లో మామిడి, 253 ఎకరాల్లో వరి చేలు దెబ్బతిన్నట్లు విన్నవించారు. కిసాన్ బీమా యోజనను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ సురక్ష సమితి నాయకులు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, నరెందుల శ్రీనివాస్, ఎడమల వెంకట్ రెడ్డి, రామచంద్రం, బొందుకూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నువ్వు సాగుపై రైతులకు అవగాహన

జగిత్యాల టౌన్, మే 7: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం నువ్వు సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ మాట్లాడుతూ, వేసవిలో సాగుకు అనువైన నువ్వు రకాలు, దిగుబడి సామర్థ్యం, పంట కాలం, తదితర అంశాలను రైతులకు వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ బలరాం మాట్లాడుతూ, నువ్వు సాగులో చీడపీడల యాజమాన్యం, వేసవిలో లోతు దుక్కులు దున్నడం వల్ల లాభాల గురించి వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ రవి మాట్లాడుతూ, మట్టి నమూనా సేకరించే విధానం, మట్టి పరీక్షల ద్వారా రైతులకు కలిగే లాభాల గురించి వివరించారు. అనంతరం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రజనీ దేవి, డాక్టర్ శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యాబోధన

సారంగాపూర్, మే 7: మండలంలోని రేచపల్లి గ్రామంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కళాశాలలో కోర్సులు, ప్రత్యేకతలను వివరించారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, అధ్యాపకులు సుజాత, వెంకటేశ్వర్లు, సంపత్ రావు, ప్రశాంత్‌కుమార్, జ్యోతిరాణి, మురళిమోహన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు దెబ్బ తిన్న పాఠశాల స్టేజీ పైకప్పు

సారంగాపూర్, మే 7: బీర్‌పూర్ మండలం తుంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టేజీ పైకప్పు, మూత్రశాలల గోడలు ఈదురుగాలులకు దెబ్బతిన్నాయని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలకు వెళ్లి చూడగా, స్టేజీ పైకప్పు ఎగిరిపోగా, మూత్రశాలలపై చెట్టు పడడంతో ధ్వంసమైనట్లు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, మే 7: తక్కళ్లపల్లి గ్రామంలో విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల పునరుద్ధరణ, మరమ్మతులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్యాల ఏఈఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మల్యాల, మే 7: మండలంలోని ముత్యంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుదవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పారు. వర్షానికి రంగుమారిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని, ఏమైనా ఇబ్బందులు తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తానని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట నాయకులు ముత్యం శంకర్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు, తదితరులున్నారు.

## పీహెచ్‌సీ సందర్శన

కథలాపూర్, మే 7: కథలాపూర్ పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఆయా విభాగాలను పరిశీలించారు. మందుల నిల్వలను పరిశీలించి పీహెచ్‌సీలో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, శ్రీధర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## 37,615 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

కోరుట్ల రూరల్, మే 7: మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 37,615 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏపీఎం శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు పేర్కొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మేడిపల్లి, మే 7: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, నాయకులు భూమేశ్‌గౌడ్, ప్రభాకర్, అజిత్‌రావు, శ్రీనివాస్, సురేశ్, చారి, రవీందర్‌రావు, వెంకటేశ్, రాజేందర్, లక్ష్మణ్, సురేందర్‌రావు, రాకేశ్, వినోద్, కృష్ణ, దాస్, నరేశ్, హరీశ్, నసీర్, గులాం, అబీద్, మహేశ్, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహ స్వామి నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 7: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, దేవస్థానం పాలక మండలి చైర్మన్ జక్కు రవీందర్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం

సారంగాపూర్, మే 7: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు తేలు రాజు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే విధంగా ఇండియన్ ఆర్మీ సోల్జర్లు ముందడుగు వేసిన తీరు భారత్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం సైనికులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

మేడిపల్లి, మే 7: మేడిపల్లి మండలం తొంబర్‌రావుపేట గ్రామానికి చెందిన బద్ధం రాజిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, రాజిరెడ్డి పార్థివ దేహంపై మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు బుధవారం పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్దినేని నాగేశ్వర్‌రావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మిట్టపెల్లి రమేశ్‌రెడ్డి, నాయకులు అంకం విజయసాగర్, ఈర్నాల సంపత్‌కుమార్, నక్కల తిరుపతి, గంగారెడ్డి, తదితరులున్నారు.

## రైతులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మేడిపల్లి, మే 7: భీమారం మండలం ఒడ్యాడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురకంటి రాజిరెడ్డి పరిశీలించారు. రైతులు, నిర్వాహకులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, సాగర్, శంకర్, లక్ష్మణ్, గంగరాజం, గంగనర్సయ్య, రుత్విక్‌రెడ్డి, నిర్వాహకులు ప్రమోద్, మహేందర్, లహరి, గంగనర్సు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులకు వినతి

మెట్‌పల్లి/కోరుట్ల/మెట్‌పల్లి రూరల్/మల్లాపూర్, మే 7: జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ రోహింగ్యా ముస్లింలను గుర్తించి వెంటనే స్వదేశాలకు పంపాలని ఆర్డీవోలు శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, తహసీల్దార్లకు బుధవారం బీజేపీ శ్రేణులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బహ్రెయిన్‌లో మల్లాపూర్ వాసి మృతి

మల్లాపూర్, మే 7: మండల కేంద్రానికి చెందిన పోగుల నరేశ్ (23) బహ్రెయిన్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబీకులు బుధవారం తెలిపారు. నరేశ్ జీవనోపాధి కోసం నాలుగేళ్ల క్రితం బహ్రెయిన్ వెళ్లి అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి మళ్లీ తిరిగి వెళ్లాడు. కాగా, అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలిపారు. నరేశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొడిమ్యాల, మే 7: మండల కేంద్రంతో పాటు కోనాపూర్, సూరంపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. తేమశాతం వచ్చిన ధాన్యం తూకం వేసి, రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేశ్, నాయబ్ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐ కరుణాకర్, ఇన్‌చార్జి ఏపీఎం పద్మ, సీసీలు వీరకుమార్, మంగ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంసాపత్రాలు అందజేత

మెట్‌పల్లి, మే 7: మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో వరల్డ్ అథ్లెటిక్స్ డే సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న 10 వేసవి శిబిరాల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిబిరాలకు పంపాలని కోరారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాందాస్, పీఈటీలు కార్తీక్, కొమురయ్య, అంజయ్య పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

కోరుట్ల, మే 7: పట్టణంలోని కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు కుంచం శంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో చోరీలు జరుగుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఉపాధిహామీ సామాజిక తనిఖీలు

కథలాపూర్, మే 7: కథలాపూర్ మండలం పోతారం, ఇప్పపెల్లి, కలికోట, అంబారిపేట, తుర్తి, పోసానిపేట, దూలూర్ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు బుధవారం తనిఖీలు చేపట్టారు. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 5 కోట్ల పనులు చేపట్టినట్లు ఎస్‌ఆర్‌పీ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

## బాధిత మహిళల రక్షణకే భరోసా సెంటర్

జగిత్యాల కలెక్టరేట్, మే 7: బాధిత మహిళల రక్షణ కోసమే భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో భరోసా కేంద్రం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు సహాయాన్ని అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గీత, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలు

పెగడపల్లి/మెట్‌పల్లి రూరల్, మే 7: పెగడపల్లి మండలం ఐతుపల్లి, మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామాల్లో బుధవారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాల్లో పశువైద్యాధికారులు హేమలత, మనీషా పటేల్, ఏఎంసీ చైర్మన్ గోవర్ధన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ

కోరుట్ల, మే 7: మెట్‌పల్లిలో ఈనెల 12న నిర్వహించే బుద్ధ పూర్ణిమ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర నాయకులు బలిజ రాజిరెడ్డి, వుయ్యాల నర్సయ్య, వివిధ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవయాన బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు దయ్య రఘువీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, ఎన్‌హెచ్‌ఎఫ్ అధ్యక్షుడు షాహేద్ మహ్మద్ షేక్, అంబేద్కర్ సంఘాల డివిజన్ అధ్యక్షుడు వుయ్యాల శోభన్, తదితరులు పాల్గొన్నారు.

## అలయన్స్ క్లబ్ కార్యవర్గం

మేడిపల్లి, మే 7: మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో బుధవారం అలయన్స్ క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ జిల్లా గవర్నర్ అల్లె బండ్ల గజానందం తెలిపారు. అధ్యక్షుడిగా రాచర్ల హన్మాండ్లు, కార్యదర్శిగా బండ్ల నరేశ్, కోశాధికారిగా కథలాపురం నరేశ్, పీఆర్‌వోగా బండ్ల మురళి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అలయన్స్ క్లబ్ ప్రతినిధులు కటుకం రాజేంద్రప్రసాద్, కటుకం సురేందర్, కటుకం రాజశేఖర్, తొగరి లక్ష్మీపతి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల వివరాలు సేకరణ

కథలాపూర్, మే 7: కథలాపూర్ మండలం భూషణరావుపేట రైతు వేదికలో బుధవారం గుర్తింపు కార్డుల కోసం రైతుల వివరాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ పరిధిలోని రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, సెల్‌ఫోన్‌తో ఏఈవోలను సంప్రదించాలన్నారు. రైతులు వివరాలు అందిస్తేనే వానకాలం సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు హరీశ్, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## పరామర్శ

సారంగాపూర్, మే 7: బీర్‌పూర్ మండలం మంగెళ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కొమురయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ జడ్పీటీసీ కొల్మూల రమణ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నేరేళ్ల సుమన్ గౌడ్, నాయకులు మల్లేశం, వెంకటేశ్, శంకర్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST
★ తేది:06/05/2025, మంగళవారం రోజున గోదావరిఖని బస్టాండ్ నుండి మా ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో నా యొక్క ఒరిజినల్ SSC Long Memo (Roll No.2307103604) పోయినది. దొరికిన వారు సంప్ర: పాటిల్ అధర్వ S/o. పాటిల్ ఆనంద్. సెల్ :7780668649
NTK-330404

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189